సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 11 । జూలై । 2025



ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరి ఒడ్డునున్న శ్రీసాయిశివబాలాజీ మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ప్రవీణ్‌శాస్త్రీ ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.



కొండగట్టులో పౌర్ణమి రద్దీ

మల్యాల: గురు పౌర్ణమి సందర్భంగా కొండగట్టు అంజన్నను భక్తులు భారీగా దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణ చేసి స్వామివారికి పూజలు చేశారు. ఈఓ శ్రీకాంత్‌రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పర్యవేక్షకులు అశోక్, హరిహరనాథ్ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇటిక్యాలలో జిల్లా అదనపు మొదటి జడ్జి పూజలు



జిల్లా జడ్జికి స్వాగతం పలుకుతున్న నాయకులు

రాయికల్: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని ఇటిక్యాలలోగల సాయిబాబా ఆలయంలో గురువారం జిల్లా అదనపు మొదటి జడ్జి నారాయణ పూజలు చేశారు. సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ హిమవంతరావు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కొండగట్టులో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న మహిళలు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం శ్రీలలిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 116మంది మహిళలు హనుమాన్ చాలీసా, హనుమాన్ పారాయణం నిర్వహించారు. లింగాష్టకం, విష్ణుసహస్రనామస్తోత్రం, అన్నపూర్ణ స్తోత్రం లలిత సహస్రనామ పారాయణం చేశా రు. లలిత సేవా ట్రస్టు ఫౌండర్ విశ్వనాథుల రమేశ్, డైరెక్టర్ కొట్టె ప్రేమలత, ఉమాలక్ష్మీ, వనజ, పులి రవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి



మొక్కల పరిశీలనకు వచ్చిన సభ్యులు

జగిత్యాలరూరల్: మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని ఎకాలజికల్ సొల్యూషన్స్ సభ్యులు శ్రీనివాస్, ప్రవీణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో హరితహారం కింద నాటిన మొక్కలను ఐవోఆర్‌ఏ ఎకనాలజికల్ సొల్యూషన్స్ న్యూఢిల్లీ వారు పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయబడిన గ్రామాల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక నిధులు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ నరేశ్, ఏపీవో గంగలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కిరీటి, టీఏలు సువర్ణ, వెంకటేశ్, శైలజ పాల్గొన్నారు.

హోదా మరిచి.. జనంతో కలిసి..



టీ తాగుతున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ :మంత్రి అయినా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు అడ్లూరి లక్ష్మణ్ కుమార్. మండలకేంద్రానికి గురువారం వచ్చిన ఆయన ఓ హోటల్ వద్ద ఆగారు. అక్కడ అందరితో కలిసి టీ తాగారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసున్నారు. సామాన్యుడిలా జనంతో కలిసి పోయిన మంత్రిని చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఈ

మల్లాపూర్: విద్యుత్ అధికారులు గురువారం పొలంబాట పట్టారు. రైతుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గుండంపల్లిలో ఎన్పీడీసీఎల్ డీఈ మధుసూదన్ పర్యటించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోయినపుడు సిబ్బందికి సమాచారం ఇవ్వాలని హితవుపలికారు. తీగలు వేలాడకుండా మధ్యమధ్య స్తంభాలు వేస్తామన్నారు. కొత్త కనెక్షన్లను సత్వరం జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఈ మనోహర్, రాఘవపేట ఏఈ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మేడిపల్లి: డీఈ గంగారాం ఆధ్వర్యంలో సిబ్బంది భీమారం మండలకేంద్రంలో పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించారు. మన్నెగూడెం ఏఈ అశోక్, సబ్ ఇంజినీర్ హరిప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభంజనం

- ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా
- అదే సమయంలో తగ్గుతున్న మరణాలు
- భయపెడుతున్న పట్టణీకరణ సమస్య
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి,పెద్దపల్లి:

దేశ ప్రగతికి, పతనానికి ప్రధాన కారణమైన జనాభా ఇప్పుడు ప్రపంచాన్నే భయపెడుతున్న అతిపెద్ద సమస్య. జనాభా తగ్గుదలపై ప్రభుత్వాలు ఆందోళన చెందుతుండగా, మారిన జీవనశైలితో పిల్లలను కనేందుకు ఆసక్తిచూపని దంపతుల సంఖ్య పెరుగుతోంది. ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ఇకపై వద్దంటూ ఒకప్పుడు ప్రభుత్వాలే ముమ్మరంగా ప్రచారం చేయగా, నేడు వీలైనంత మందిని కనండని ప్రభుత్వాలే వేడుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో జనాభా పెరుగుదల కనిపిస్తుండగా, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గాయి. పెరిగిన జనాభా విద్య, ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు వలసపోతుండడంతో పల్లె చిన్నబోతుంది. పంట పొలాలు కనుమరుగై ఆకాశహర్మ్యాలు వెలుస్తున్నాయి. కరీంగనర్, రామగుండం కార్పొరేషన్‌తో సహా జిల్లాకేంద్రాలుగా మారిన మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా మారుతుండటం పట్టణాలకు వలసపోతున్న జనాభాకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నియంత్రణతో అడ్డుకట్ట

జనాభా పెరుగుదల అభివృద్ధికి ఆటంకమన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేసింది. అయినా 1952 నుంచి 1975 ఎమెర్జెన్సీ కాలం వరకు విపరీతంగా పెరిగింది. ఎమెర్జెన్సీ తర్వాత 1976లో ప్రకటించిన జాతీయ జనాభా విధానం అనుగుణంగా వివాహ వయస్సు పెంచడం, ఆర్థిక ప్రోత్సాహకాలు, మహిళ అక్షరాస్యత పెంపుతో జనాభా తగ్గుదల నమోదైంది. అయితే ఇటీవల కరోనా సమయం అనంతరం జనాభా స్థిరీకరణపై ప్రభుత్వాలు దృష్టిసారించాయి.

పట్టణీకరణే ప్రధాన సమస్య

జిల్లాల విస్తరణ, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుతో ఉపాధి, సౌకర్యవంతమైన జీవనం కోరుతూ ప్రజలు నగరం బాట పడుతున్నారు. కొత్త జిల్లాలుగా ఏర్పాడిన పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కేంద్రాల్లోనూ పట్టణీకరణ వేగం పుంజుకుంటోంది. ప్రభుత్వ వైద్యం, విద్యా సదుపాయాలను మెరుగుపరుస్తుండడం, కొత్త కట్టడాల నిర్మాణం పెరుగుతుండడంతో వివిధ వర్గాలకు ఉపాధి లభిస్తోంది. దీంతో ఆయా




కేంద్రాల్లో జనాభా పెరుగుదల కనిపిస్తోంది. దీంతో మున్సిపాలిటీల్లో జనాభా ఒత్తిడి పెరుగుతుంది. ఆయా జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడం సవాలుగా మారుతుంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా వసతుల కల్పనపై ప్రత్యేక చొరవ చూపిస్తేనే సమస్యలు తీరనున్నాయి.

పట్టణ ప్రాంతాల్లో పెరిగిన జనాభా

పట్టణం	1991	2001	2011
కరీంనగర్	1,48,583	2,05,653	2,61,185
జగిత్యాల	67,591	85,521	96,460
రామగుండం	2,14,384	2,36,600	2,58,644
సిరిసిల్ల	50,048	65,314	77,550
కోరుట్ల	40,080	54,012	66,504

పెరిగిన జననాలు

జనన, మరణాలను అధికారికంగా నమోదు చేసే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం–2021 నివేదిక ఆధారంగా 2021లో జిల్లాలో నమోదైన జననాలను విడుదల చేసింది. ఈ నివేదిక ఆధారంగా చూస్తే 43,345 జననాలు ఉండగా, మరణాలు 26,757 నమోదయ్యాయి. మెడికల్ వసతులు పెరగడం కారణంగా తెలుస్తోంది.



సీఆర్ఎస్-2021 నివేదిక ప్రకారం జననాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
కరీంనగర్	11,726	10,063	21,789
పెద్దపల్లి	4,834	4,538	9,372
జగిత్యాల	6,134	6,050	12,184
సిరిసిల్ల	2,690	2,338	5,028

సీఆర్ఎస్- 2021 నివేదిక ప్రకారం మరణాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
కరీంనగర్	5,353	3,138	8,491
పెద్దపల్లి	3,984	2,582	6,566
జగిత్యాల	3,995	2,575	6,570
సిరిసిల్ల	3,027	2,103	5,130

2011 జనాభా ప్రకారం

జిల్లా	మహిళలు	పురుషులు	మొత్తం
జగిత్యాల	4,85,819	5,03,094	9,88,913
పెద్దపల్లి	3,97,585	3,94,251	7,91,836
కరీంనగర్	5,04,620	5,01,091	10,05,711
సిరిసిల్ల	2,74,109	2,77,928	5,52,037

గ్రామీణ, పట్టణ జనాభా

జిల్లా	గ్రామీణం	పట్టణం
జగిత్యాల	7,67,577	2,21,336
పెద్దపల్లి	4,87,823	3,04,013
కరీంనగర్	6,96,727	3,08,984
సిరిసిల్ల	4,35,145	1,16,892

లింగనిష్పత్తి

జిల్లా	మొత్తం జనాభా పరంగా	ఆర్లేళ్ల పిల్లల జనాభా పరంగా
జగిత్యాల	1,036	947
పెద్దపల్లి	992	922
కరీంనగర్	993	931
సిరిసిల్ల	1,014	942

ఆరేళ్ల లోపు పిల్లల జనాభా (2011 జనాభా ప్రకారం)

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
జగిత్యాల	48,048	45,523	93,571
పెద్దపల్లి	34,614	31,899	66,513
కరీంనగర్	46,124	42,955	89,079
సిరిసిల్ల	25,099	23,652	48,751

ఇద్దరు ముద్దు



ఇండియాలో జనాభా అత్యధికంగా పెరిగిపోయింది. ఇద్దరు ఎంతో ముద్దు. ఇద్దరు పిల్లలైతే ఒకరికొరు తోడుగా ఉంటారు. ఒకరికన్నా ఇద్దరు ఉండటమే బెటర్. ప్రస్తుతం దేశ జనాభా పెరిగిపోవడం ఇబ్బందికరంగా మారింది. ఆర్థిక పరిస్థితి చేయిదాటిపోతుంది. ప్రస్తుత హైటెక్ యుగంలో ప్రతి దంపతులు ఇద్దరికే మొగ్గు చూపుతున్నారు. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుంది.

– మచ్చ శంకర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జగిత్యాల

ముగ్గురు పిల్లలున్నా హ్యాపీయే



ప్రస్తుతం చాలామంది ఒకరు లేదా ఇద్దరు పిల్లలనేకంటున్నారు. పిల్లలు ఎక్కువగా ఉంటే కష్టంగా ఉంటుందని ఆలోచిస్తున్నారు. నేను గ్యారేజీ నడుపుకుంటున్నాను. ఇష్టంగానే ముగ్గురు పిల్లలను కన్నాను. హ్యాపీగా ఉన్నాను. నా జీవితం హాయిగా సాగుతోంది. ఒకరు, ఇద్దరు అని ప్రస్తుత హైటెక్ యుగంలో ఉమ్మడి కుటుంబాలు సైతం తగ్గిపోతున్నాయి. అందరితో కలిసి ఉంటే సంతోషంగా ఉంటుంది.

– ద్యాగల నరేశ్, జగిత్యాల

ప్రత్యామ్నాయ లైన్లతో.. విద్యుత్ సమస్యకు చెక్

- నాలుగు గ్రామాలకు తీరనున్న విద్యుత్ సమస్య
- నేరెళ్ల నుంచి రూ.53 లక్షలతో పనులు
- 11 కిలోమీటర్ల 33 కేవీ విద్యుత్తు లైన్ ఏర్పాటు
- లక్ష్మీదేవిపల్లి రోడ్డు వెంట పాత లైన్‌పునరుద్ధరణ

సారంగాపూర్: మండలకేంద్రంతోపాటు.. పోతారం, బట్టపల్లి, నాయికపుగూడెం గ్రామాలకు 40 ఏళ్లక్రితమే విద్యుత్ సౌకర్యం ఉంది. అయితే చిన్నపాటి వర్షం పడినా.. గాలివీచినా సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. అటవీప్రాంతం కావడంతో విద్యుత్ పునరుద్ధరణకు చాలా సమయం పడుతోంది. దీనిని అధిగమించడానికి విద్యుత్ అధికారులు శ్రీకారం చుట్టారు. నాలుగు గ్రామాల సమస్య తీర్చడానికి ప్రస్తుతం ఉన్న రెండు 33 కేవీ లైన్లకు అదనంగా మరో రెండు లైన్లు వేస్తున్నారు.

- మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉన్నాయి.
- సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి గ్రామాల్లో 33 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి.
- సారంగాపూర్ సబ్‌స్టేషన్ కింద సారంగాపూర్, నాయికపుగూడెం, పోతారం, బట్టపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది.
- జగిత్యాల మండలం పొలాస మీదుగా తిప్పన్నపేట, హైదర్‌పల్లి నుంచి సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.



పనులు పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

- సారంగాపూర్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చే లైన్ మూడు కిలోమీటర్ల మేర పూర్తిగా అటవీప్రాంతంలో ఉంది.
- వానవచ్చినా.. ఈదురుగాలులు వీచినా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి అటవీప్రాంతంలో లైన్లు తెగిపోతున్నాయి.
- విద్యుత్ వైర్లపై చెట్లు పడి స్తంభాలు విరిగిపోతున్నాయి.
- విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది రాత్రి పూట ఇబ్బంది పడుతున్నారు.
- ఇలా గంటల తరబడి వర్షంలో శ్రమించాల్సి వస్తోంది.
- ఏటా వర్షాకాలం, వేసవిలో ఈ సమస్య తరచూ ఉత్పన్నమవుతోంది.

ప్రత్యామ్నాయ లైన్లతో చెక్

- సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయికపుగూడెం గ్రామాలకు విద్యుత్ సమస్య ఉండకూడదన్న ఆలోచనతో ఆ శాఖ రూ.53లక్షలతో ధర్మపురి మండలం నేరెళ్ల నుంచి సారంగాపూర్ సబ్‌స్టేషన్‌కు అదనంగా మరో 33 కేవీ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది.
- మూడు నెలల క్రితం పనులు ప్రారంభించింది.
- 11 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేస్తున్న 33 కేవీ లైన్ నేరెళ్ల నుంచి నేరుగా సారంగాపూర్ సబ్‌స్టేషన్‌కు చేరుతుంది.
- విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ డీఈఈ ఆధ్వర్యంలో పనులు వేగంగా సాగుతూ.. పూర్తి కావచ్చాయి.
- ఈ నెలఖరులోగా నేరెళ్ల లైన్‌కు కనెక్షన్ ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నారు..

మూడో లైన్ పునరుద్ధరణ..

- నేరెళ్ల నుంచి కొత్త లైన్ నిర్మాణం పూర్తికాగా.. లక్ష్మీదేవిపల్లి నుంచి సారంగాపూర్‌కు రోడ్డు వెంట గతంలో వేసిన పాత లైన్‌ను పునరుద్ధరిస్తున్నారు.
- దీని ద్వారా సారంగాపూర్ సబ్‌స్టేషన్‌కు మూడు లైన్లు సిద్ధమవుతున్నాయి.
- నాలుగు గ్రామాలకు ఏ ఒక్కక్షణం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

కొత్త లైన్లు ఏర్పాటు సంతోషం



సారంగాపూర్ అడవిలో చెట్లు పడి కరెంట్ నిలిచిపోయేది. అటు పొలాలకు కరెంట్ లేక.. పంటలకు ఇబ్బంది కలిగేది. ఇళ్లలో దోమల బెడదతో తట్టుకోలేకపోయేవాళ్లం. రాత్రిపూట బయట అడుగుపెట్టడం కష్టంగా ఉండేది. అధికారులు కొత్తగా చేపట్టిన నేరెళ్ల లైన్‌తో సమస్య లేకుండా తీరుతుంది.

– పురుమల్ల నగేష్‌రెడ్డి, సారంగాపూర్

చాలా ఏళ్ల సమస్య తీరింది



మేం 40 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు విద్యుత్ అధికారులు ఇప్పుడు పరిష్కరిస్తున్నారు. కొత్త లైన్లతో ఒక లైన్ నుంచి కరెంట్ రాకున్నా.. మరో లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు పొలాలకు నీరు పెట్టేందుకు ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు ఆ సమస్య తీరుతుండడం ఆనందంగా ఉంది.

– న్యారబోయిన రాజేశం, సారంగాపూర్

కొత్త లైన్ ప్రారంభిస్తాం



నేరెళ్ల నుంచి ఏర్పాటు చేస్తున్న 33 కేవీ విద్యుత్ లైన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఉన్నతాధికారుల సహకారంతో మరో 15 రోజుల్లో ఈ లైన్ నుంచి విద్యుత్తు సరఫరా ప్రారంభిస్తాం. కొత్త లైన్ల ఏర్పాటుతో సారంగాపూర్, బట్టపల్లి, నాయికపుగూడెం, పోతారం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉండదు.

– ప్రవీణ్, ఏఈ, సారంగాపూర్

సీఎంకు తెలంగాణపై కమిట్‌మెంట్ లేదు

- బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలే ప్రజలకు జనతా గ్యారేజ్
- నాయకులు, కార్యకర్తలను వేధిస్తే ఐక్య పోరాటాలు
- స్థానిక సంస్థల్లో అన్ని స్థానాలూ గెలుచుకుందాం
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, చిత్రంలో నాయకులు

మల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ పట్ల కమిట్‌మెంట్ లేదని, ఆయనలో కంటెంట్ కూడా లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర నాయకులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ పాలనలో నంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి అవినీతిమయం చేశారని విమర్శించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దోచుకుంటున్నారన్నారు. పథకాల లబ్ధిదారులను డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేద్దామన్నారు. అధికార పార్టీ నాయకుల దాడులు, వేధింపులకు దిగితే తామే నిలబడి కొట్లాడుతామని భరోసా ఇచ్చారు. అర్హులకు ఏ పథకం అందకున్నా.. కలెక్టరేట్‌ను ముట్టడిద్దామన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ వైస్ ఎంపీపీ నాగేష్ పాల్గొన్నారు.

గురుకులం పాఠశాలను సందర్శించిన ప్రవీణ్‌కుమార్

మెట్‌పల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఎమ్మెల్యేతో కలిసి సందర్శించారు. పాఠశాలలో సమస్యలపై సిబ్బంది, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వివరించగా.. తానే స్వయంగా జనరేటర్‌ను సమకూరుస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

భగీరథ నీటి సరఫరా నిలిపివేత

- వెంకట్రావ్‌పేట వద్ద పగిలిన పైపు
- వారం రోజులుగా అక్కడ లీకేజీలు
- మరమ్మతు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం



పగిలిన పైపు నుంచి వృథాగా పోతున్న నీరు

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేట వద్ద జాతీయ రహదారి పక్కనున్న మిషన్ భగీరథ పైపు గురువారం పగిలింది. దీంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోయింది. వారం క్రితం అక్కడ లీకేజీలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి మరమ్మతు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతూ వస్తున్నారు. తాజాగా పైపు ఒక్కసారిగా పగలడంతో నీరు జాతీయ రహదారి మీదుగా దిగువన ఉన్న ఖాళీ స్థలాల్లోకి భారీగా వచ్చి చేరింది. రోడ్డుపై నీటి ప్రవాహంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. నీటి ఉధృతి తగ్గిన తర్వాత రాకపోకలు కొనసాగాయి. సంఘటనా స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ మోహన్, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ప్రధాన పైపులైన్ పగలడంతో శుక్రవారం నుంచి జిల్లాకు నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం కనిపిస్తోంది.

రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు

జగిత్యాల: జగిత్యాల బల్దియాలో రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బల్దియా కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ బీఎస్.లత ఆధ్వర్యంలో గురువారం అధికారులతో సమీక్షించారు. పట్టణంలో విలీన ప్రాంతాలకు రూ.20 కోట్లు, తాగునీటికి రూ.32 కోట్లు, అమృత్‌స్కీం కింద రూ.38 కోట్లు మంజూరయ్యాయని, వాటితో పనులు ఎలా చేపట్టాలో ప్రణాళిక రూపొందించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం, ఎల్ఆర్ఎస్, స్టాంప్ డ్యూటీ, ఇతర పనులపై ఆరా తీశారు. అర్బన్ హౌసింగ్ కాలనీ, డబుల్‌బెడ్‌రూం ఇందిరమ్మ కాలనీలో చేపట్టాల్సిన వసతులకు అంచనాలు రూపొందించాలన్నారు. డ్రైనేజీ, పైప్‌లైన్ల విషయలంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం దృష్ట్యా దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, శానిటేషన్ అధికారులు పకడ్బందీగా పనిచేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందన, ఏఈలు చరణ్, అరుణ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

పల్లెదవాఖానాలతో మెరుగైన వైద్యం

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య దవాఖానాలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య దవాఖానాల నిర్మాణాలు, రూ.25 లక్షల ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించే సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన భూ తగాదా

- వరుసకు అన్నపై తమ్ముడి దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


రవి (ఫైల్)

ధర్మపురి: భూతగాదాలో గొడవ పడి వరుసకు అన్న అయిన రవిపై తమ్ముడు కత్తితో దాడి చేయడంతో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని దోనూర్‌కు చెందిన గొల్లెన రవి, నాగరాజు అన్నదమ్ముల కొడుకులు. వారి మధ్య కొంత కాలంగా ఇంటిస్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల రవికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకాగా నిర్మాణం చేపడుతున్నాడు. గురువారం ఇంటి స్థలం విషయంలో ఇరువురి మధ్య గొడవ జరగగా నాగరాజు రవిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు



మెట్‌పల్లిరూరల్: తాటి చెట్టుపై నుంచి కింద పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన చిలివేరి సత్యనారాయణ తాటిచెట్టుపై కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడని బంధువులు తెలిపారు.

యూరియా అతి వినియోగంపై ఆందోళన

- మోతాదులో వాడాలని కేంద్ర ప్రభుత్వ సూచన
- సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రాలకు సూచన


మొక్కజొన్న పంటకు యూరియా వేస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సరిగ్గా లేక.. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వాళ్లం. హరితవిప్లవం రావడంతో అధిక దిగుబడినిచ్చే కొత్త విత్తనాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా దిగుబడులు పెరిగాయి. అదే సమయంలో అధిక దిగుబడి ఇచ్చేందుకు రైతులు రసాయన ఎరువులు వేయడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు దొరికే యూరియాను రైతులు అధికంగా వాడుతున్నట్లు వ్యవసాయశాఖ నివేదికల్లో తేలింది. యూరియా మోతాదును మించి పంటలకు వాడుతున్నారని స్వయంగా కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి జేపీ.నడ్డా ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఒక్క వానాకాలం సీజన్‌లో సాగుచేసిన పంటలకే 13,843 టన్నుల యూరియా అవసరం. ఈ మేరకు జిల్లాలో మార్చి వరకు 7607 టన్నుల యూరియా ఉండగా.. ఏప్రిల్‌లో 4248 టన్నులు, మేలో 1257 టన్నులు, జూన్‌లో 470 టన్నులు, జూలైలో 261 టన్నులు రావాల్సి ఉండగా.. రాష్ట్రానికి రావాల్సిన యూరియాపై కేంద్రం కోత విధిస్తోంది. దీంతో జిల్లాకు అంతంతమాత్రంగానే యూరియా వచ్చింది. ఇక రానున్న రోజుల్లో దొరుకుతుందో..? లేదో..? అని రైతులు అవసరం లేకున్నా నిల్వ చేసుకుంటున్నారు. ప్రస్తుతం యూరియా దొరకకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఏ మొక్కకైనా నత్రజని, భాస్వరం, పొటాష్ అవసరం. నత్రజని యూరియా రూపంలో లభిస్తుంది. భాస్వరం సింగిల్ సూపర్ పాస్ఫేట్, డైఅమ్మోనియం పాస్ఫేట్ (డీఏపీ)ను రైతులు వినియోగిస్తారు. దాదాపు 85 శాతం డీఏపీని కెనాడ, రష్యా, అమెరికాతో పాటు జోర్డాన్, మొరాకో వంటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. ముడి పొటాష్‌ను సైతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

అవసరాన్ని మించి వినియోగం

శాస్త్రవేత్తల సూచనల ప్రకారం పంటలకు సాధారణంగా 4:2:1 నిష్పత్తిలో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు అందించాల్సి ఉంటుంది. కానీ.. రైతులు ప్రస్తుతం 7.2:2.9:1 నిష్పత్తిలో వాడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. రసాయన ఎరువులు అధికంగా వాడే పంజాబ్‌లో 18.6:5.4:1 నిష్పత్తితో మరింత ఎక్కువగా వినియోగిస్తున్నారు. అందుకే పంజాబ్‌లో పర్యావరణంతోపాటు ఆహార పదార్థాలు కూడా కాలుష్యంతో నిండిపోయి క్యాన్సర్ రోగులు పెరిగిపోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. యూరియా వినియోగం పెరగడం.. పోషకాల సమతుల్యత లోపించడం, సేంద్రియ ఎరువుల వాడకం తగ్గడం, పంటల సాంద్రత పెరగడం, పంటల సరళిలో మార్పులు రావడం, పంట పొలాల్లో కార్బన్ లోపించడం వంటి కారణాలతోనే భూముల్లో జింక్ లోపం ఏర్పడుతోంది.

వేపపిండితో మేలు..

యూరియా వాడినప్పుడు విధిగా వేప పిండిని 5:1 నిష్పత్తిలో అంటే 5 కిలోల యూరియాలో కిలో వేప పిండిని కలిపి వాడితే భూమికి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. పంటలకు చీడపీడల ఉధృతి తగ్గుతుంది. యూరియా నీటిలో కొన్నాళ్లపాటు నిలువ ఉండి.. మొక్కలకు అవసరమైన సమయంలో అందిస్తుంది. పచ్చిరొట్ట అయిన జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద వంటి పంటలను వేసిన భూమిలోనే రసాయన ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుంది. వేసవి పంటల అనంతరం పొలంలో గొర్రెలు, మేకలు, పశువుల మంద ద్వారా పోషకాలు అధికంగా లభిస్తాయి. ఆయా పంటల్లో రసాయన ఎరువులను భూసార పరీక్షలకు అనుగుణంగా వాడాలి. నేల, వాతావరణ పరిస్థితులను బట్టి రసాయన ఎరువులను పొదుపుగా వాడటం మంచిది.

యూరియా కొరత లేకుండా చూడాలి



జిల్లాలో యూరియా కొరత లేకుండా చూడాలి. యూరియా అధికంగా వాడుతున్నారనే సాకుతో యూరియా కోటాను తగ్గించడం చేయవద్దు. పంటల దశలను బట్టి యూరియా సరఫరా చేయాలి.

– బందెల మల్లయ్య, రైతు సంఘం నాయకుడు, చల్‌గల్

యూరియాను నిల్వ చేయొద్దు



జిల్లాలో యూరియా అందుబాటులోనే ఉంది. అవసరం లేకున్నా తీసుకెళ్లి ఇళ్లలో నిల్వ చేయవద్దు. పంటల పెరుగుదలకు అనుగుణంగా యూరియా సరఫరా చేస్తాం. యూరియాతో పాటు సేంద్రియ ఎరువులను కూడా వాడాలి.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

'ఓటుకు నోటు' ముద్దాయిని సీఎం చేశారు..

- దొంగ చేతికి ఇంటి తాళాలు ఇవ్వడంతో రాష్ట్రం అధోగతి పాలు
- పథకాల మత్తు మందు చల్లి కాంగ్రెస్ అధికారం చేపట్టింది
- ప్రజల తరఫున బీఆర్‌ఎస్ నిలదీస్తున్నందునే అక్రమ కేసులు, విచారణలు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్‌కుమార్

మల్లాపూర్: ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన ముద్దాయిని కాంగ్రెస్ పార్టీ సీఎంను చేసిందని, దొంగ చేతికి ఇంటి తాళాలు ఇవ్వడంతో 18 నెలలుగా రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్.రమణ, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంపై అవగాహన లేక కేసీఆర్, కేటీఆర్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని, ప్రతిసారీ సవాల్ చేస్తూ.. పారిపోతున్నారని విమర్శించారు. ఆయన సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్ చర్చకు రమ్మంటే రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తోకముడిచిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలపై పథకాల మత్తుమందు చల్లి కాంగ్రెస్ అధికారం చేపట్టిందని, పాలన చేతకాక నంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని ఆగం చేసిందని తెలిపారు. కేటీఆర్, బీఆర్‌ఎస్ ప్రజల కోసం రాజీలేని పోరాటం చేస్తుంటే ఈ–ఫార్ములా, ట్యాపింగ్ కేసులు, కమిషన్ల పేరిట విచారణలతో ప్రభుత్వం కుట్రపూరితంగా వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ పాలనలో విద్యావ్యవస్థ నాశనమైందని, గురుకులాల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని తెలిపారు. విద్యార్థులకు భరోసా కల్పించడంలో విఫలం కావడంతో పాటు బాధితులను పరామర్శించి ఆదుకునేవారే కరువయ్యారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా హోం మంత్రిగా ఉన్నందునే పోలీసులు అక్రమ కేసులతో వేధిస్తున్నారని, బీఆర్‌ఎస్ పార్టీ పోరాటాలతోనే వీటిని ఎదుర్కొంటోందన్నారు. ప్రస్తుత పాలనపై ప్రజల్లో అంగీకారం లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై సంధించిన అస్త్రం 'మథనం'


మహిపాల్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెన్నెల

జగిత్యాల: సమాజంలోని సామాజిక రుగ్మతలపై సంధించిన అస్త్రం మథనం పుస్తకమని సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల అన్నారు. జగిత్యాలకు చెందిన కళాకారుడు ఎములవాడ మహిపాల్ రచించిన మథనం కవితాసంపుటిని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అద్భుతమైన సాహిత్య పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాకారులు విజయ్, క్రాంతి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై మహిళ ఫిర్యాదు


ఫిర్యాదు కాపీతో డీఎస్పీ కార్యాలయం వద్ద భావన

జగిత్యాలక్రైం: తనను కానిస్టేబుల్ బండపల్లి ప్రసాద్ ప్రేమ వివాహం చేసుకుని మోసం చేయడంతోపాటు మరో యువతితో ఇటీవల కనిపించకుండా పోయాడంటూ సారంగాపూర్ మండలం బీర్‌పూర్ గ్రామానికి చెందిన కస్తూరి భావన జగిత్యాల డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. భావన జగిత్యాలలో హాస్టల్‌లో ఉన్న సమయంలో ఒకసారి డయల్ 100కు కాల్ చేసింది. ఆ సమయంలో పరిచయమైన కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లికి చెందిన బండపల్లి ప్రసాద్ అనే కానిస్టేబుల్ మాయమాటలు చెప్పి ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజులు తనతో కాపురం చేసి.. కొన్నాళ్లుగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో కనిపించకుండాపోయాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

గోదావరి తీర గ్రామాలు అప్రమత్తం

ధర్మపురి/సారంగాపూర్: ధర్మపురి, బీర్‌పూర్ మండలాల్లోని గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి తహసీల్దార్ సుమన్, బీర్‌పూర్ ఎస్సై ఎస్.రాజు ఆయా గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీర్‌పూర్‌లోని చిన్నకొల్వాయి, రేకులపల్లి, కమ్మునూర్ గ్రామాల్లో పర్యటించిన ఎస్సై.. ఎగువన ఉన్న కడెం ప్రాజెక్టులోకి భారీ వరద వచ్చి చేరుతోందని, ఏ క్షణమైనా ప్రాజెక్టు గేట్లు ఎత్తి గోదావరిలోకి వదులు తారని, ప్రజలు గోదావరిలోకి పశువులు, గొర్రెలను మేపేందుకు వెళ్లవద్దని సూచించారు.

పంటల సాగుపై అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: రావెప్ విద్యార్థులు పంటల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకున్నారు. వ్యవసాయ వర్సిటీ మాజీ ఈఆర్‌సీ సభ్యుడు శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ అగ్రికల్చర్ విద్యార్థులు కొడిమ్యాల మండలం రామకృష్ణాపూర్‌కు చేరుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలతోపాటు సాగు పద్ధతులు తెలుసుకున్నారు. కొండాపూర్ మైసమ్మ చెరువుకు కాలువల ద్వారా నీటి సరఫరాపై వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు వెల్ముల రాంరెడ్డి వివరించారు. మాజీ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, విద్యార్థినులు శృతి, ప్రణీత, శ్రావణి, దీప్తి, హరిణి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ: తప్పిన ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొన్నాయి. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు వెళ్తూ.. మెట్‌పల్లి బస్‌స్టేషన్‌లో ఆగింది. ప్రయాణికులతో జగిత్యాల వైపు బయలుదేరిన బస్సు.. ఔట్ గేట్ నుంచి జాతీయ రహదారి పైకి వెళ్లగానే ఓ లారీ వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయి ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులు, సిబ్బందికి ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దెబ్బతిన్న వాహనాన్ని బస్‌స్టేషన్‌కు తరలించి నిర్మల్ డిపోకు సమాచారమందించారు. అక్కడి అధికారులు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మరో బస్సును పంపించారు.